సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 17 । జూన్ । 2023



అంతులేదు ఆ పాపాలకీ..

నాటు తుపాకీతో తన భార్యను కాల్చిన వ్యక్తితోపాటు మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

8లో



..'మద్దతు'తో ఊరట

కేంద్ర ప్రభుత్వం పంట ఉత్పత్తులకు మద్దతు ధర పెంచడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 41° / 30°

జిల్లాలో శనివారం ఎండ తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. ఉదయం నుంచే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

'ఓపెన్' ఫలితాలు విడుదల

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. పదో తరగతికి సంబంధించి 820 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 194 మంది ఉత్తీర్ణులయ్యారు. 23.66 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్మీడియట్‌లో 993 మంది పరీక్ష రాయగా, 402 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 40.48 శాతం ఉత్తీర్ణత నమోదైందని డీఈఓ ఇ.సోమశేఖరశర్మ తెలిపారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈ నెల 24 నుంచి జూలై 4వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్‌లో ఒక్కో సబ్జెక్ట్‌కు రీకౌంటింగ్‌కు రూ.400, రీ వెరిఫికేషన్‌కు రూ.1200, పదో తరగతిలో ఒక్కో సబ్జెక్ట్‌కు రీకౌంటింగ్‌కు రూ.350, రీ వెరిఫికేషన్‌కు రూ.1200 చెల్లించాలని సూచించారు.

రేపు టీబీజీకేఎస్ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ఇల్లెందు గెస్ట్‌హౌజ్‌లో ఈ నెల 18న తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) సెంట్రల్ కమిటీ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకట్రావు, మిరియాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగెర్ల మల్లయ్యతోపాటు 11 ఏరియాల ఉపాధ్యక్షులు పాల్గొననున్నారు. ఈ మేరకు కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎం.సోమిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొంటాం

బీఎస్పీ రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ మంద ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం నియోజకవర్గంలో అధికార బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనే శక్తి తమ పార్టీకి మాత్రమే ఉందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ మంద ప్రభాకర్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన అసెంబ్లీ బూత్ కమిటీ సభ్యుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంతోపాటు కొత్తగూడెం నియోజకవర్గంలో కూడా బీఎస్పీ జెండాను ఎగరవేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన అంతర్గత సర్వేలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో నోట్ల కట్టలతో గెలవాలని కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని, ఓటర్లు చైతన్యవంతమైన ఓటు ఆయుధంతో కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి జక్కని సంజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఝెర్రా కామేష్, జిల్లా అధ్యక్షుడు ఇర్పా రవికుమార్, జిల్లా మహిళా కన్వీనర్ బండి రమణి, సలహాదారు గంధం మల్లికార్జున రావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

దేశద్రోహం కేసుల నమోదు సరికాదు..

ఖమ్మం మామిళ్లగూడెం: హక్కుల నేత, విద్యావేత్త, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులపై రాష్ట్ర ప్రభుత్వం ఉపా చట్టం కింద దేశ ద్రోహం కేసు నమోదు చేయడం గర్హనీయమని వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పేర్కొన్నారు. మేధావులు, బుద్ధి జీవులు, ప్రజా సంఘాల నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదని తెలిపారు. ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ పద్మజాషా, పీఓడబ్ల్యూ నేత సంధ్య, అరుణోదయ విమలక్క తదితరులపై ఉపా చట్టం కింద నమోదు చేసిన కేసును వెనక్కి తీసుకోవాలనే డిమాండ్‌తో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు శుక్రవారం ఖానాపురం హవేలీ సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. నాయకులు బి.ఝాన్సీ, చందు, సీహెచ్.శిరోమణి, నామాల ఆజాద్ పాల్గొన్నారు. చైతన్యవేదిక, స్పర్శ వేదికల బాధ్యులు తాళ్లూరి వేణు, కాకి భాస్కర్ ఆధ్వర్యాన జెడ్పీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

ఆ.. కొన్నారులే..!



పాల్వంచ మండలంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా వేస్తున్న హమాలీలు(ఫైల్)

సగం కూడా చేరని ధాన్యం సేకరణ లక్ష్యం

- ముగింపు దశకు చేరుకున్న కొనుగోళ్ల ప్రక్రియ
- 136 కొనుగోలు కేంద్రాల్లో ప్రస్తుతం నడుస్తున్నవి ఏడే..

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తక్కువ మొత్తంలోనే ధాన్యం కొనగా, ఎక్కువ మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకే విక్రయించుకోవాల్సి వచ్చింది. దీంతో మద్దతు ధర పొందలేకపోయారు. ధాన్యం కొనుగోలుకు పీసీఏఎస్‌ల ఆధ్వర్యంలో 105, డీఆర్‌డీఏ 3, జీసీసీ 28.. మొత్తం 136 ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు పీఏసీఎస్‌ల పరిధిలో 33,312.8 మెట్రిక్ టన్నులు, డీఆర్‌డీఏ ద్వారా 476.4 మెట్రిక్ టన్నులు, జీసీసీ ద్వారా 1,334.6 మెట్రిక్ టన్నులు మొత్తం 35,123.8 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నారు. ప్రస్తుతం కొనుగోళ్ల ప్రక్రియ ముగింపు దశకు చేరడంతో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో మాత్రమే 7 కేంద్రాల్లో ఇంకా కొనుగోళ్లు జరుగుతున్నాయి.

కొరవడిన సమన్వయం..

ధాన్యం దిగుబడి రాకముందే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని అధికారులు ప్రకటించినా.. చాలా చోట్ల అనేక అవాంతరాలతో సకాలంలో తెరవకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ, పౌరసరఫరాల సంస్థ, సహకార, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో కొనుగోలు కేంద్రాలు నిర్వహించాల్సి ఉంది. ఆయా శాఖల్లో సమన్వయ లోపం కొరవడడంతో చాలా చోట్ల కేంద్రాలు ప్రారంభించడం లేదని రైతులు నిరసన వ్యక్తం చేశారు. చివరకు ఐడీఓసీలో నిర్వహించే ప్రజావాణిలో కూడా రైతులు ధాన్యం అమ్మకాలపై ఫిర్యాదు చేశారు. అకాల వర్షాలతో వడ్లు తడుస్తున్నాయని, వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని పలుచోట్ల ఆందోళన చేశారు. కొనుగోళ్ల సందర్భంగా మిల్లర్లు 10 కేజీల వరకు తరుగు తీస్తున్నారనే ఆరోపణలు సైతం వెల్లువెత్తాయి. నాణ్యత పేరిట రైతులను ఇబ్బంది పెట్టారు. ఇలా అనేక ప్రతికూల పరిస్థితుల్లో రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం అమ్ముకున్నారు. ఈ పరిణామాలు లక్ష్య సాధనకు అటంకాలుగా మారాయి. మిగిలిన ఏడు కేంద్రాలను కూడా మూసేసే సమయానికి 80 వేల మెట్రిక్ టన్నుల లక్ష్యంలో సగం కూడా కొనుగోళ్లు జరిగే అవకాశం కనిపించడం లేదు.

రబీ సీజన్ ధాన్యం వివరాలు..

దిగుబడి అంచనా	: 1.60 లక్షల మెట్రిక్ టన్నులు
సేకరణ లక్ష్యం	: 80 వేల మెట్రిక్ టన్నులు
ఇప్పటివరకు కొన్నది	: 35 వేల మెట్రిక్ టన్నులు

సేకరణలో లక్ష్యంలో 44 శాతమే..

గత రబీ సీజన్‌కు సంబంధించి చాలా తక్కువ మొత్తం ధాన్యమే కొన్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు. 1.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందులో సగం 80 వేల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకు 35,123.8 మెట్రిక్ టన్నులే కొనుగోలు చేశారు. అంటే సేకరణ లక్ష్యంలో 44 శాతం కొన్నారని, అదే దిగుబడిలో చూసుకుంటే 22 శాతమే కొన్నారని, దీంతో అధిక మంది ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుని నష్టపోయారని అన్నదాతలు పేర్కొంటున్నారు.

ఏడు కేంద్రాలు నడుస్తున్నాయి



ధాన్యం కొనుగోళ్లు ముగింపు దశకు చేరాయి. ప్రస్తుతం ఏడు కేంద్రాల్లోనే సేకరిస్తున్నాం. కేంద్రాలకు వడ్లు రాకపోతే మరో నాలుగైదు రోజుల్లో వాటినీ మూసేస్తాం. ఎండల తీవ్రత, హమాలీల కొరతతో కొన్ని చోట్ల కొనుగోళ్లు ఆలస్యమయ్యాయి.

–మల్లికార్జున్‌బాబు, పౌరసరఫరాల శాఖ అధికారి

అమ్మకానికి ఇబ్బంది పడ్డాం



ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ సేకరణలో తీవ్ర జాప్యం చేశారు. ఫలితంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. చివరికి మా ప్రాంత రైతులు కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. చివరకు అధికారులు స్పందించారు.

– కృష్ణమూర్తి, రైతు, ప్రభాత్‌నగర్

చాలా వరకు ప్రైవేట్ వ్యాపారులకే



కొనుగోళ్లు త్వరగా ప్రారంభించకపోవడం, నాణ్యత ప్రమాణాల పేరుతో ఇబ్బంది పెట్టడంతో చాలా మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకే ధాన్యం అమ్ముకున్నారు. ఈసారి ప్రభుత్వం మద్దతు ధర పెంచినా నిబంధనలే మాకు ప్రతిబంధకాలయ్యాయి. – మున్నాలాల్, రైతు, బసవతారక కాలనీ

108కు సుస్తీ..



లక్ష్మీదేవిపల్లి మండలంలోని 108 అంబులెన్స్(ఇన్‌సెట్) విరిగిన ముందుభాగం, అరిగిన టైరు

- ప్రస్తుతం కాలం చెల్లిన అంబులెన్సులే ఎక్కువ
- వర్షాకాలంలో పెరగనున్న వాహనాల అవసరం
- మరోవైపు కొత్త అంబులెన్స్‌ల కొనుగోలులో జాప్యం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇటీవల వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలానికి చెందిన ఓ వ్యక్తికి ప్రాణాపాయ స్థితి ఎదురైంది. దీంతో కుటుంబ సభ్యులు 108కి కాల్ చేశారు. సమయానికి అక్కడికి చేరుకున్న 108 అంబులెన్సు ఆ వ్యక్తిని తీసుకుని ఆస్పత్రికి తిరుగు పయనమైంది. ఇంతలో గేరుబాక్సులో సమస్య వచ్చి ఆ వాహనం ముందుకు కదలకుండా మొరాయించింది. చివరకు అతన్ని ఆటోలో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విలువైన సమయం వృథా కావడంతో ఆ వ్యక్తి మరణించాడు. దీంతో ఒక్కసారిగా 108 వాహనాల కండీషన్ ఎలా ఉందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే విష జ్వరాలు, అనారోగ్య సమస్యలు ఎక్కువగా వచ్చే వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో ఈ అంశానికి ప్రాధాన్యత పెరిగింది.



ఆపదలో ఆదుకుంటున్న అంబులెన్సులు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయంలో ఎవరి ఊహలకూ అందని విధంగా అత్యవసర సేవల విభాగం కింద 108 వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. అంచెలంచెలుగా ప్రతీ మండలానికో అంబులెన్సును కేటాయించారు. గడిచిన పదిహేడేళ్లలో ఈ వాహనాలు ఫోన్ చేసిన వెంటనే స్పందిస్తూ సంఘటనా స్థలానికి చేరుకుంటున్నాయి. బాధితులను ఆస్పత్రులకు చేరవేస్తున్నాయి. ఈ క్రమంలో లక్షలాది మంది ప్రాణాలను కాపాడాయి. ఏ మూలకైనా, ఈ క్షణంలోనైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే 108 కాల్ చేయొచ్చనే సామాజిక భరోసా ఏర్పడింది. అప్పటి సీఎం వైఎస్సార్ సైతం బహిరంగ సభల్లో కుయ్..కుయ్.. అంటూ 108 ప్రస్తావన తీసుకువచ్చేవారు. ఏళ్ల తరబడి సామాజిక భద్రత, సంక్షేమానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్న 108 వాహనాలు జీవిత కాల పరిమితి ముగిసినా ఇంకా సేవలందిస్తూనే ఉన్నాయి.

కాలం చెల్లినా..

ప్రస్తుతం జిల్లాలోని భద్రాచలం, కొత్తగూడెం డివిజన్ల పరిధిలో 21 వరకు 108 అంబులెన్స్‌లు ఉన్నాయి. ఇందులో 14 వాహనాలు మూడు లక్షల కిలోమీటర్లకు పైగా తిరిగాయి. రవాణా శాఖ నిబంధనల ప్రకారం మూడు లక్షల కిలోమీటర్ల పైగా తిరిగిన వాహనాల జీవిత కాలం చెల్లిపోయినట్టుగా పరిగణిస్తారు. ప్రస్తుతం ఉన్న 108 వాహనాల్లో కొన్నయితే నాలుగు లక్షలు, ఐదు లక్షల కిలోమీటర్లు తిరిగినవి కూడా ఉన్నాయి. ఎప్పుడో జీవిత కాలం పూర్తయిపోవడంతో కిటికీలు, డోర్లు, టైర్లు సరైన స్థితిలో లేవు. గేర్‌బాక్సులు, ఇంజన్లలో లోపాలు తరచుగా తలెత్తుతున్నాయి. ఇటు మెకానిక్‌లు, అటూ 108 సిబ్బంది ఓపిక, శ్రమలతోనే ఈ వాహనాలు ప్రజలు సేవలు అందే విధంగా అందుబాటులో ఉంచుతున్నారు. కొత్తగా ఏర్పడిన చుంచుపల్లి మండలానికి ఇప్పటికీ 108 వాహనం కేటాయించలేదు.

రీప్లేస్‌మెంట్‌లో జాప్యం..

జిల్లాలో ఉన్న 108 వాహనాల్లో దమ్మపేట, ములకలపల్లి, చంద్రుగొండ, ఇల్లెందు, మణుగూరు, చర్ల, బూర్గంపాడులకు చెందిన 108 వాహనాలే కొత్తవి. ఈ వాహనాలే కాలుష్య నియంత్రణ నియమావళి భారత్ స్టేజ్ 6 (బీఎస్–6) ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయి. మిగిలినవన్నీ డొక్కు వాహనాలే. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం బీఎస్–6 ప్రమాణాల కిందకు రాని వాహనాలు 2023, జూలై 1 నుంచి రోడ్లపై తిరగకూడదు. అత్యవసర సేవల కిందకు వచ్చే వాహనాలకు రీప్లేస్‌మెంట్ కోసం రెండు నెలల వరకు గడువు ఉంది. దీంతో ఈ పాటికే కొత్త 108 వాహనాల టెండర్ల ప్రక్రియ పూర్తయ్యి, కొత్త అంబులెన్స్‌లు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఆ పని జరగలేదు. కొత్త అంబులెన్సుల కొనుగోలు ప్రక్రియ ఇంకా టెండర్ల దశలోనే ఉంది.

త్వరగా అందుబాటులోకి తెస్తే మేలు..

రాష్ట్రంలోనే విస్తీర్ణం ఎక్కువగా ఉన్న జిల్లాలో నల్గొండ తర్వాత భద్రాద్రి కొత్తగూడేనిది అగ్రస్థానం. ఏజెన్సీ జిల్లా కావడంతో ఒక్కో మండలం విస్తీర్ణం కూడా ఎక్కువే. కండీషన్‌లో ఉన్న వాహనాలే సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకోవడం, తిరిగి ఆస్పత్రికి వెళ్లడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఇక కాలం చెల్లిన వాహనాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇప్పటికే వానాకాలం ప్రారంభమైనందున సాధ్యమైనంత త్వరగా 108 వాహనాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

అవార్డులే ప్రగతి సోపానాలు

- ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ
- ఘనంగా పట్టణ ప్రగతి దినోత్సవం
- హాజరైన కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్సీ తాతా మధు



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, వేదికపై ఎమ్మెల్యే హరిప్రియ, ఎమ్మెల్సీ మధు తదితరులు

ఇల్లెందు: మూడున్నరేళ్ల కాలంలో ప్రభుత్వ సహకారంతో పాలకవర్గం పట్టణంలో సుమారు రూ.143 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టిందని, మున్సిపాలిటీకి వచ్చిన అవార్డులే ప్రగతి సోపానాలని ఎమ్మెల్యే హరిప్రియ తెలిపారు. శుక్రవారం ఇల్లెందు మున్సిపల్ పట్టణ ప్రగతి, తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక బీట్ మార్కెట్‌లో ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం, సింగరేణి నుంచి 41 ఎకరాల భూమి సాధించామని తెలిపారు. మిషన్ భగీరథతో నీటి సమస్యను అధిగమించామని, రూ.30 కోట్లతో వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నామని, జీఓ 76 ద్వారా 2 వేల మందికి లబ్ధి చేకూరిందని తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, అజయ్ కుమార్ సహకారంతో బస్ డిపో కల నెరవేరిందని చెప్పారు.

జాతీయ స్థాయి అవార్డు అందుకోవాలి

ఇల్లెందు రాష్ట్రస్థాయి అవార్డులతోపాటు జాతీయ స్థాయి అవార్డులు కూడా కైవసం చేసుకోవాలని కలెక్టర్ డి.అనుదీప్ ఆశాభావం వ్యక్తం చేశారు. బుగ్గవాగు పూడిక తీతతో పట్టణంలో ముంపు ప్రమాదం తప్పిందని అన్నారు. సెంట్రల్ లైటింగ్‌తో పట్టణంలో కాంతిరేఖలు విరజిమ్ముతున్నాయని, రాష్ట్రంలో ఏ బ్రోచర్ తయారు చేసినా ఇల్లెందుకు అందులో స్థానం ఉంటోందని పేర్కొన్నారు.

గుజరాత్‌లో కూడా ఇంత అభివృద్ధి లేదు..

సీఎం కేసీఆర్ ఉద్యమ నాయకుడు కావటం వల్లే ప్రజలకు తగిన పథకాలను రూపకల్పన చేశారని ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తోందని అన్నారు. ప్రధానమంత్రి మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో కూడా ఇలాంటి అభివృద్ధి లేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జానీపాషా, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, పులిగళ్ల మాధవరావు, కమిషనర్ అంకుషావళి, తహసీల్దార్ కృష్ణవేణి, మాజీ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, పీఆర్ డీఈ రామకృష్ణ, ఏఈ శంకర్, కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు. వేడుకలకు తొలుత మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఎగురవేశారు. ఎమ్మెల్యే, చైర్మన్, కమిషనర్ స్వచ్ఛ వాహనాలు, వర్కర్లతో శానిటేషన్ దుస్తులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోలాటం, మెప్మా యంత్రాంగం నృత్యాలు, బతుకమ్మలతో ఆటా పాటా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కార్మికులను, ఉద్యోగులను ఘనంగా సత్కరించారు.



బతుకమ్మతో వస్తున్న ఎమ్మెల్యే

'పాలిసెట్' వెరిఫికేషన్..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జరిగిన సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు 320 మంది అభ్యర్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ కన్వీనర్ బి.నాగముని నాయక్ తెలిపారు. అభ్యర్థులు ముందే ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లు సరిచూసుకుని వెరిఫికేషన్‌కు హాజరుకావాలని సూచించారు. ప్రతీ సర్టిఫికెట్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తామని పేర్కొన్నారు.

ఐటీడీఏలో గోల్‌మాల్?

- టెండర్ల ఖరారులో నిబంధనలకు నీళ్లు
- కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన కొందరు అధికారులు
- ఈ ఏడాదైనా పాఠశాలల్లో డిప్యూటేషన్లు సక్రమంగా జరిగేనా..!
- ఐటీడీఏలో బయోమెట్రిక్ హాజరు అమలెప్పుడో..



భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం

భద్రాచలం: ఐటీడీఏలో గత విద్యాసంవత్సరంలో చేపట్టిన ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డెన్ల డిప్యూటేషన్లు.. రద్దు వ్యవహారం విమర్శలకు తావిచ్చింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలోనూ అధికారుల్లో మార్పు కనిపించడం లేదు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాల, గురుకుల పాఠశాలలు, కళాశాలలో విద్యార్థుల కోసం నిత్యావసర సరుకులు, గుడ్లు, చికెన్ సరఫరాకు ఇటీవల నిర్వహించిన టెండర్లను నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టినట్లు పీఓకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ఐటీడీఏలో పారదర్శకత కరువైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అర్హత లేకపోయినా టెండర్లు..

ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, కళాశాలలో నిత్యావసర సామగ్రి, ఆహార వస్తువులు, గుడ్లు, చికెన్ తదితర వస్తువుల సరఫరాకు ఇటీవల టెండర్లు నిర్వహించారు. కొందరు అధికారులు కాంట్రాక్టర్లతో మిలాఖత్ అయి నిబంధనలకు విరుద్ధంగా టెండర్లను కట్టబెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉదాహరణకు పాల్వంచ మండలంలో గిరిజనుడిని కాదని గిరిజనేతరుడికి టెండర్‌ను అప్పగించటం వివాదాస్పదంగా మారింది. గిరిజనుడి కంటే గిరిజనేతరుడు చికెన్‌ను తక్కువ ధరకు కోట్ చేశారు. టెండర్‌దారుడు సొంత వాహనం, మాంసపు దుకాణం కలిగి ఉండి మున్సిపాలిటీ/గ్రామపంచాయతీకి పన్ను చెల్లించి ఉండాలి. సేల్స్ ట్యాక్స్, ఇన్‌కంట్యాక్స్‌లతో పాటుగా జీఎస్‌టీ ప్రతులను షెడ్యూల్‌లో సమర్పించాలి. మార్కెట్‌లో సొంత దుకాణం, మున్సిపాలిటీ పన్ను చెల్లింపు రశీదులు, ఇతర అర్హతలు లేకపోయినా ఏకపక్షంగా గిరిజనేతరుడికి టెండర్ అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సదరు గిరిజనేతరుడు కిరాణా దుకాణం నడుపుతూ చికెన్ దుకాణం నడుపుతున్నట్లు అధికారులును పక్కదోవ పట్టించాడని, ఓ చికెన్ షాప్ యజమాని వద్ద సబ్ కాంట్రాక్ట్‌గా కొంటూ, అదే షాప్‌ను తన చికెన్ షాప్‌గా పేర్కొంటూ టెండర్ దక్కించుకున్నాడని, ఇదంతా కొందరు అధికారుల కనుసన్నల్లోనే జరిగినట్లు తెలుస్తోంది. దీంతో గిరిజన సంఘ నాయకులు ఐటీడీఏ పీఓకు, గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇతర మండలాల్లో సైతం అర్హతలు లేనివారికి ఐటీడీఏలోని 'కొందరు పెద్దల' చల్లటి చూపుతో టెండర్లు దక్కాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఐటీడీఏ పరిధిలో అన్ని యూనిట్లలో జరిగే అభివృద్ధి, సంక్షేమ పనులలో అధికారులు నిబంధనలకు పాతరేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

కోవిడ్ పోయినా..

ఐటీడీఏలో అధికారుల, సిబ్బంది సమయపాలన పాటించడంలేదని, విధులకు ఇష్టారీతిన హాజరవుతున్నారని విమర్శలు ఉన్నాయి. ఐటీడీఏలో అన్ని యూనిట్లలో కలిపి సుమారు 120 మంది వరకు పనిచేస్తున్నారు. వీరందరూ ఐటీడీఏలోని డీడీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ మిషన్‌పై ఉదయం, సాయంత్రం వేళల్లో వేలిముద్రతో హాజరు నమోదు చేసుకునేవారు. కోవిడ్ సమయంలో నిబంధనల ప్రకారం బయోమెట్రిక్ పద్ధతికి మినహాయింపు ఇచ్చారు. కానీ ఇప్పటివరకు మళ్లీ బయోమెట్రిక్ విధానం అమల్లోకి తేలేదు. దీంతో కొందరు ఉద్యోగులు కార్యాలయ వేళల్లో బయట తిరుగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు పనులపై వచ్చే గిరిజనులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

డిప్యూటేషన్లలో ఈసారి ఏం చేస్తారో..?

2022–23 విద్యా సంవత్సరంలో ఆశ్రమ పాఠశాలలో పనిచేసే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డెన్లకు నియమ నిబంధనలకు విరుద్ధంగా మౌఖిక ఆదేశాలతో డిప్యూటేషన్లను ఇవ్వడం.. అనంతరం రద్దు చేయడం గిరిజన సంక్షేమ శాఖకే మచ్చ తెచ్చాయి. 2023–24 విద్యా సంవత్సరంలో ఇప్పటికే ఆరుగురు టీచర్లను ఉపాధ్యాయులు లేని ఏకోపాధ్యాయ పాఠశాలలకు, ఎనిమిది ఆశ్రమ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులను సీనియారిటీ ప్రకారం నియమించారు. గతేడాది సుమారు 80 మందికి డిప్యూటేషన్ ఇవ్వగా.. ఈసారి కూడా అదే సంఖ్యలో డిప్యూటేషన్లను నిర్వహిస్తారా.? లేక ఆ పోస్టులను సీఆర్‌టీలతో భర్తీ చేస్తారా? అనే విషయం తేలాల్సి ఉంది. గతంలో లాగానే ఉపాధ్యాయ సంఘాలను ఆహ్వానించి నిబంధనల మేరకు డిప్యూటేషన్లు ఇవ్వాలని, పీఓ సమక్షంలో పారదర్శకంగా ఈ ప్రక్రియ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

విచారణకు సమయం లేదు..

ఐటీడీఏ ఆధ్వర్యంలో అందరి సమక్షంలోనే టెండర్లను పారదర్శకంగా నిర్వహించి అప్పగించాం. వారు సమర్పించిన వివరాలపై విచారణ చేయటానికి సమయం లేదు. అభ్యంతరాలు నిజ నిర్ధారణ అయితే విచారణ జరిపి టెండర్‌దారులను బ్లాక్ లిస్ట్‌లో పెడతాం. బయోమెట్రిక్ యంత్రం పునరుద్ధరణకు టెక్నికల్ టీంను సంప్రదించాం. త్వరలోనే పునరుద్ధరిస్తాం.

–డేవిడ్ రాజ్, ఐటీడీఏ ఏపీఓ జనరల్

కొత్తగూడెం, ఇల్లెందు మున్సిపాలిటీలకు అవార్డులు





అవార్డు అందుకుంటున్న కొత్తగూడెం చైర్‌పర్సన్, కమిషనర్, ఇల్లెందు చైర్మన్, కమిషనర్

కొత్తగూడెంఅర్బన్/ఇల్లెందు: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకల్లో భాగంగా ఉత్తమ మున్సిపాలిటీలకు శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో అవార్డులు అందజేశారు. కొత్తగూడెం మున్సిపాలిటీకి శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రంగంలో ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపికైంది. ఇల్లెందుకు హరితహారంలో పచ్చదనం విభాగంలో ప్రథమ స్థానం లభించగా, స్వయం సహాయక సంఘాలు స్ట్రీట్ వెండర్స్ విభాగంలో రెండో స్థానం లభించింది. ఇల్లెందుకు ఉత్తమ అవార్డు ఇది రెండోసారి. మున్సిపల్ చైర్‌పర్సన్, చైర్మన్ కాపు సీతాలక్ష్మి, డి.వెంకటేశ్వరరావు, కమిషనర్లు రఘు, అంకుషావళి మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, సీడీఎంఏ సత్యనారాయణ, మాజీ చీఫ్ సెక్రటరీ రాజీవ్‌శర్మ, మంత్రి శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

క్లుప్తంగా

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం


అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం పంచామృతాభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం, నివేదన, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు పురాణం రవికుమార్‌శర్మ, దుర్గాప్రసాద్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు సందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింత నాగరాజు, కిలారు నాగమల్లేశ్వరరావు, గంధ వెంగళరావు, బేతంశెట్టి విజయ్‌కుమార్, సంకా వెంకటరామారావు భక్తులు పాల్గొన్నారు.

రుద్రహోమం పూజలు

పెద్దమ్మతల్లి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా శుక్రవారం రుద్రహోమం వైభవంగా నిర్వహించారు. పూజలో పాల్గొన్న దంపతులకు అమ్మవారి శేషవస్త్రప్రసాదాలను అందజేశారు.

వృద్ధులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న ఆలయ అధికారులు, ఉద్యోగులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలను విభిన్నంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం సరోజమ్మ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేసి తమ సేవా గుణం చాటుకున్నారు. ఆలయ ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవాని రామకృష్ణ, ఆశ్రమ నిర్వాహకురాలు సరోజమ్మతో కలిసి వృద్ధులకు అన్నదానం, పండ్లను పంచిపెట్టారు. ఈఈ రవీందర్, సీసీ అనిల్, ఉద్యోగులు నిరంజన్, కత్తి శ్రీనివాస్, కిషోర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకవచధారణలో రామయ్య

దేవస్థానంలోని అంతరాలయంలో శుక్రవారం రామయ్య మూలమూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. బేడా మండపంలో స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం గావించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

అవార్డుకు ఎంపికైన జర్నలిస్ట్


తుమ్మలపల్లి ప్రసాద్

ఇల్లెందు: మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన విద్యావేత్త, జర్నలిస్ట్ తుమ్మలపల్లి ప్రసాద్.. మోటూరు హనుమంతరావు అవార్డుకు ఎంపికయ్యారు. శుక్రవారం ప్రసాద్ వివరాలు తెలిపారు. కారేపల్లి మండలం మాధారం గ్రామానికి చెందిన 85 ఏళ్ల కొప్పెర అనసూర్య తీవ్ర అనారోగ్యంతో ఉన్న తన కోడలికి సేవలందిస్తున్న విషయం 2023, మార్చి 8న 'మగువ నీకు వందనం' శీర్షికన కథనం ప్రచురితమైంది. ప్రసాద్ రాసిన ఈ కథనం పలువురి ప్రశంసలు అందుకోవడంతోపాటు మోటూరు హనుమంతరావు పేరుతో అందజేస్తున్న అవార్డుకూ ఎంపికైంది. ఈ నెల 20న పుట్టపర్తిలో జరిగే సభలో అవార్డు ప్రదానం చేస్తారని ప్రసాద్ తెలిపారు.

వడదెబ్బతో గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అశ్వాపురం: మండలంలోని సీతారాంపురం జెడ్పీహెచ్ఎస్ వద్ద చెట్టు కింద గుర్తు తెలియని వ్యక్తి (40) శుక్రవారం వడదెబ్బతో మృతి చెందాడు. భిక్షాటన చేసుకునే ఆ వ్యక్తి చెట్టు కింద కూర్చుని మృతి చెంది ఉండటంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వడదెబ్బతో మృతి చెంది ఉంటాడని చెప్పారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని అశ్వాపురం సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,346

అంతులేదు ఆ పాపాలకీ..

- పోలీసుల అదుపులో సామ్యా?
- అతడితోపాటే మరో ముగ్గురు కూడా?
- కలకలం రేపుతున్న నాటు తుపాకుల వినియోగం


సామ్యా వద్ద నుంచి నాటు తుపాకీ స్వాధీనం చేసుకుంటున్న డీఎస్పీ రెహమాన్

జూలూరుపాడు: నాటు తుపాకీతో తన భార్యను కాల్చిన వ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. గురువారం రాత్రి మండలంలోని భోజ్యాతండా (పుల్లుడుతండా)లో ఈ ఘటన చోటు చేసుకోగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో బాధితురాలు లావుడ్యా శాంతి అలియాస్ బుజ్జి భర్త సామ్యాతోపాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. చండ్రుగొండ మండలం పోకలగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద నాటు తుపాకీ తీసుకున్నట్లు పోలీసులకు సామ్యా చెప్పాడని సమాచారం. దీంతో సామ్యాకు నాటు తుపాకీ ఇచ్చిన వ్యక్తిని గురువారం అర్ధరాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. సామ్యాకు సహకరించిన భోజ్యాతండాకు చెందిన ఓ మహిళ, మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. 2018 లో అక్రమ ఆయుధాల కేసులో లావుడ్యా సామ్యా అలియాస్ శంకర్‌తోపాటు అతని సోదరుడు లావు డ్యా శర్వాణ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సామ్యా, శర్వాణ్‌లకు నాటు తుపాకులను పోకలగూడేనికి చెందిన భూక్యా హరి అమ్మినట్లు విచారణలో తేలింది. ఆ సమయంలో నాటు తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐదేళ్ల తరువాత మళ్లీ వేటగాళ్ల చేతిలోకి నాటు తుపాకులు చేరాయి. ఆనాడు సామ్యా, శర్వాణ్‌ల నుంచి రెండు నాటు తుపాకులు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే, సామ్యా తన భార్యపై కాల్పులు జరిపిన నాటుతుపాకీ మళ్లీ ఎలా వచ్చిందనేది ప్రశ్నగా మారింది. అప్పట్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకీ.. ఇప్పుడు సామ్యా కాల్చిన తుపాకీ వేర్వేరని గ్రామస్తులు చెబుతున్నారు. సామ్యా వద్ద మొత్తం మూడు తుపాకులున్నాయని, పోలీసులకు అప్పగించిన తుపాకీ కాకుండా శాంతిని కాల్చిన తుపాకీ, మరో తుపాకీ ఎక్కడ ఉన్నాయనే పోలీసులు విచారిస్తే తెలుస్తుందని పేర్కొంటున్నారు. అడవి జంతువుల సంరక్షణకు అటవీశాఖ అధికారులు నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా పలువురు చెబుతున్నారు.

సామ్యాను కఠినంగా శిక్షించాలి

భార్యను నాటు తుపాకీతో కాల్చిన లావుడ్యా సామ్యా అలియాస్ శంకర్‌ను కఠినంగా శిక్షించాలని పుల్లుడుతండా ప్రజలు కోరుతున్నారు. అడవి జంతువులనే కాదు చివరకు సొంత భార్యను చంపడానికి వెనకాడని సామ్యా వల్ల ప్రమాదం పొంచి ఉందని తమకు రక్షణ కల్పించాలని శుక్రవారం పుల్లుడుతండాను సందర్శించడానికి వచ్చిన సర్పంచ్ కిషన్‌లాల్‌తో చెప్పారు. ఊరంతా కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.


పోలీసులు అరెస్టు చేసిన వేటగాళ్లలో లావుడ్యా సామ్యా (కుడివైపు వ్యక్తి) (ఫైల్)

కఠిన చర్యలు తీసుకుంటాం..

చండ్రుగొండ/అన్నపురెడ్డిపల్లి/టేకులపల్లి: గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరిగితే సర్పంచ్‌లే బాధ్యత వహించాల్సి ఉంటుందని డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సూచించారు. చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్లలో శుక్రవారం వేర్వేరుగా ఆయన సర్పంచ్‌లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ, చట్టవ్యతిరేక ఘటనలు జరిగితే పూర్తిబాధ్యత సర్పంచ్‌లే వహించాల్సి ఉంటుందన్నారు. నాటు తుపాకుల వాడకం, వన్యప్రాణుల వేట లాంటి సమాచారం మందస్తుగా పోలీసులకు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు సర్పంచ్‌లతో లిఖితపూర్వక హామీ తీసుకున్నట్లు తెలిసింది. అన్నపురెడ్డిపల్లి కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ వసంత కుమార్, ఎస్ఐ షాహీన పాల్గొన్నారు. అలాగే టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలోనూ ఇల్లెందు డీఎస్పీ వైవీ రమణమూర్తి సైతం ఇవే హెచ్చరికలు జారీ చేశారు.


ఆ తుపాకీ ఎక్కడిది..?

- పోకలగూడెంలో నాటు తుపాకుల కలకలం

చండ్రుగొండ: జూలూరుపాడు మండలం భోజ్యాతండా (పుల్లుడుతండా)లో లావుడ్యా సామ్యా అలియాస్ శంకర్ తన భార్యను హతమార్చేందుకు పేల్చిన నాటుతుపాకీ ఎక్కడిదని మండలంలో చర్చనీయాంశంగా మారింది. భార్యపై హత్యాయత్నం చేసిన శంకర్‌ను అదుపులో తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు. ఈ క్రమంలో అతడు ఇచ్చిన సమాచారంతో పోకలగూడెం గ్రామానికి చెందిన భూక్య హరిని పోలీసులు అదుపులో తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. బోజ్యాతండాకే చెందిన ఓ వ్యక్తి 2018లో నాటుతుపాకీతో వన్యప్రాణులను వేటాడుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. అప్పట్లోనూ పోకలగూడెంనకు చెందిన హరి ఆ తుపాకీ విక్రయించినట్లు విచారణలో తేలింది. ఈ కేసులో హరి జైలుశిక్ష అనుభవించాడు. తాజాగా దొరికిన నాటుతుపాకీ హరినే విక్రయించినట్లు పోలీసుల విచారణలో తేలిందని సమాచారం. ఈ విషయమై డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌ను వివరణ కోరగా నాటుతుపాకీ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో విచారణ జరుతున్నామన్నారు.

ఉగ్రభానుడు

రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత

ఖమ్మం గాంధీచౌక్: సూర్యప్రతాపం ఏ మాత్రం తగ్గడం లేదు. ఉదయం ఏడు గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తుండగా మధ్యాహ్నంకల్లా ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయి చేరుతున్నాయి. ఎండకు వడగాలులు తోడవుతుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇక రాత్రి ఏడు, ఎనిమిది గంటల వరకు ఎండల ప్రభావం తగ్గక బయటకు రావాల్సిన వారు ఇబ్బంది పడుతున్నారు. కాగా, శుక్రవారం రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత భద్రాద్రి జిల్లా ములకపల్లిలో 45.3, పాల్వంచ మండలం యానంబైల్‌లో 45.2 డిగ్రీలుగా నమోదైంది. ఇక ఖమ్మం జిల్లా పమ్మిలో 44.9, మధిరలో 44, పల్లెగూడెంలో 43.9, ఎర్రుపాలెంలో 43.7, ముదిగొండ, గంగారం, నేలకొండపల్లిలో 43.6, చింతకాని, ఖానాపురంలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో కనిష్టంగా కూడా 41.2 డిగ్రీ ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం.

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన గిరిజనులు


ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న గిరిజనులు

అశ్వారావుపేటరూరల్: తమ గ్రామంలోని తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గిరిజనులు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా ఖాళీ బిందెలతో రహదారిపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని బచ్చువారిగూడెం జీపీ చిచ్చొడిగుంపు గ్రామానికి కొన్నేళ్లుగా గుమ్మడవల్లి పంచాయతీ నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నారు. కానీ, వారం కిందటి నుంచి గుమ్మడవల్లి నుంచి చిచ్చొడిగుంపునకు తాగునీటి సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో గ్రామస్తులంతా ఖాళీ బిందెలతో ప్రధాన రహదారిపై ధర్నా చేసి, సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అశ్వారావుపేట - వేలేరుపాడు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.

విషయం తెలుసుకున్న స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రాంబాబు.. ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని, పైపులైన్ల నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారంతా ఆందోళన విరమించారు.

ఇళ్ల స్థలాలు, పోడు పట్టాలు ఇవ్వండి

- ఆర్‌పీఐ ఆధ్వర్యాన ఛలో కలెక్టరేట్
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన పేదలు, రైతులు


సభలో మాట్లాడుతున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, పోడు సాగు చేసే ప్రతీ గిరిజనుడికి పట్టా ఇవ్వాలనే డిమాండ్‌తో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం చలో కలెక్టరేట్ చేపట్టారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో రైతులు, పేదలు తరలిరాగా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం జరిగిన సభలో ఆర్‌పీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావుగౌడ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలను తొమ్మిదేళ్లుగా మోసం చేస్తోందని ఆరోపించారు. ఇళ్లస్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకపోగా పోడు రైతులందరికీ పట్టాలు ఇవ్వొద్దనే కుట్ర పన్నిందని విమర్శించారు. కార్యక్రమంలో ఆర్‌పీఐ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దిశెట్టి సామేలు, ఏపీ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డితో పాటు ప్రభుదాస్, రోజారాణి, రత్నప్రసాద్, గోరక్‌సింగ్, రాము, సంపత్‌గౌడ్, అజయ్‌బాబు, కోటా శివశంకర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేసి గెలుస్తాం..


అభివాదం చేస్తున్న నాయకులు

చర్ల: వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేసి కచ్చితంగా గెలుస్తామని ఏపీఎస్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూపా నాగేశ్వరరావు, ఏఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి పాండ్రు హేమసుందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్ఎంహెచ్ హాస్టల్ ఆవరణలో జరిగిన ఏపీఎస్‌పీ, ఏఎస్‌పీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో జరుగనున్న ఎన్నికల్లో అన్ని గిరిజన సంఘాలను ఐక్యం చేసి స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలుస్తామని స్పష్టం చేశారు. ఇక ఎవరి అడుగులకు మడుగులొత్తే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. సమావేశంలో సోంది మల్లుదొర, నూపా సీతయ్య, తాటి వెంకటేశ్వర్లు, సోంది శంకర్, కురసం రవి, రేసు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రషర్‌లో బాలకార్మికుడికి తీవ్ర గాయాలు

పాల్వంచ రూరల్: క్రషర్ బీటీ ప్లాంట్‌లో పడి ఒడిశాకు చెందిన బాలుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని తోగ్గూడెంలో ఉన్న కేఆర్‌కే క్రషర్ బీటీ ప్లాంట్‌లో ఒడిశాకు చెందిన బాలుడు మహేందర్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ప్లాంట్‌లో పడగా తీవ్రంగా గాయాలయ్యాయి. కాగా యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా బాలుడిని చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించగా, పరిస్థితిగా విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. శుక్రవారం రాత్రి సమయంలో బాలుడి తల్లిదండ్రులకు కేఆర్‌కే క్రషర్ యాజమాన్యం సమాచారం ఇచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్వారీలో గతంలో కూడా పలుమార్లు ప్రమాదాలు జరిగాయని, యాజమాన్యం కార్మికుల రక్షణ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం


కాలిబూడిదైన పూరిల్లు

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మల్లాయిగూడెం గ్రామ పంచాయతీ తాటినాగులగుంపు గ్రామానికి చెందిన కుంజా మంగ సమీపంలోని పామాయిల్ తోటలో కూలి పనులకు వెళ్లింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి మంగకు చెందిన పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. కాగా, ఇంట్లో గ్యాస్ సిలిండర్ ఉండటంతో గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు భయపడ్డారు. గ్యాస్ సిలిండర్ పేలిన తర్వాత మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా అప్పటికే ఇంట్లో ఉన్న సామగ్రి అంతా కాలిబూడిదైంది. మంటల్లో కౌలుకు సంబంధించిన రూ.లక్ష నగదుతోపాటు రూ.50 వేల విలువ గల బీరువా, వంట సామగ్రి, దుస్తులు కాలిపోగా బాధితురాలు కట్టుబట్టలతో మిగిలింది. ఆమెను సర్పంచ్ నారం రాజశేఖర్ పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.

పామాయిల్ తోట దగ్ధం

దమ్మపేట: మంటలు అంటుకుని పామాయిల్ తోట దగ్ధమైన ఘటన మండలంలోని మల్లారం గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత రైతుల కథనం ప్రకారం.. మండలంలోని మల్లారం గ్రామ శివారులో కోట వెంకటేశ్వరరావు, కోట రాజీవ్‌కు ఉమ్మడిగా మూడు ఎకరాల పామాయిల్ తోట ఉంది. శుక్రవారం మల్లారం గ్రామ శివారులో గల వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే దారికి చుట్టుపక్కల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించిన ఉపాధి హామీ కూలీలు వాటిని తగలబెట్టారు. ఆ మంటలు సమీపంలో ఉన్న పామాయిల్ తోటలోకి వ్యాపించడంతో డ్రిప్ పైపులు పూర్తిగా కాలిపోగా, పామాయిల్ మొక్కలు చాలావరకు కాలిపోయాయి. ప్రమాదంతో రూ.2 లక్షలు నష్టం వచ్చిందని, రెండేళ్ల వరకు కూడా దిగుబడి వచ్చే అవకాశం లేదని బాధిత రైతులు వాపోయారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


నరేందర్ (ఫైల్)

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. టేకులపల్లి ఎస్ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. కోయగూడెం గ్రామానికి చెందిన అబ్బనబోయిన లింగయ్య, సత్యవతి దంపతుల కుమారుడు నరేందర్ (25) తాపీ పని చేస్తుంటాడు. శుక్రవారం తన ద్విచక్ర వాహనంపై టేకులపల్లికి వచ్చి తిరిగి వెళ్తుండగా ఓ ఎద్దుకు ఢీకొని కిందపడటంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు 108 ద్వారా సులానగర్ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి కొత్తగూడెం ఏరియాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్న భర్తపై భార్య ఫిర్యాదు చేయడంతో స్థానిక పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని భగవాన్‌దాస్‌కాలనీకి చెందిన దుర్గాప్రసాద్‌తో అలేఖ్యకు 12 ఏళ్ల కిందట వివాహమైంది. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతుండటంతో అలేఖ్య తల్లిగారింటికి వెళ్లింది. తిరిగి ఇటీవల దుర్గాప్రసాద్ దగ్గరికి వచ్చి ఉంటోంది. కాగా, తనను చంపుతానని దుర్గాప్రసాద్ బెదిరిస్తున్నాడని అలేఖ్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

టైర్ చోరీపై

కారు టైరు చోరీకి గురైన ఘటనపై శుక్రవారం స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని మెడికల్‌కాలనీలో ఉన్న తన బంధువుల ఇంటికి ఈ నెల 14న రామకష్ణ తన కారులో వచ్చాడు. తరువాతి రోజు నిద్రలేచి చూడగా తన కారుకు ఉండాల్సిన టైర్ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఐదుగురిపై కేసు

అశ్వారావుపేటరూరల్: ఓ వ్యక్తిపై దాడి చేసి, గాయపరిచిన ఘటనలో ఐదుగురిపై శుక్రవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ బి.రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. పేటమాలపల్లికి చెందిన కొవ్వూరి శరత్‌బాబుతో ఓ విషయంపై ఇదే ప్రాంతానికి చెందిన జోనమాల శ్రీకాంత్, శ్రీరామ్, బొడా రాంబాబు, మున్నా, అభిషేక్ వాగ్వాదానికి దిగారు. అనంతరం శరత్‌బాబుపై దాడికి దిగడంతో అతడు గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడిచేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి

దమ్మపేట: భూవివాదం కారణంగా ఓ వ్యక్తిపై భౌతిక దాడికి పాల్పడిన ఘటన దమ్మపేట శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. దమ్మపేటకు చెందిన దారా శ్రీనివాసరావుకు గ్రామ శివారులో మూడెకరాల పామాయిల్ తోట కుంది. అదే గ్రామానికి చెందిన దారా నాగేశ్వరరావు.. ఆ భూమి తనదే అంటూ తోటలోకి వెళ్లే దారికి అడ్డంగా కంచె వేశాడు. దీనిపై దారా శ్రీనివాసరావు కొత్తగూడెం జూనియర్ సివిల్ జడ్జి నుంచి ఇంజక్షన్ ఆర్డర్ పొందాడు. శుక్రవారం తోటకు అడ్డంగా వేసిన కంచెను శ్రీనివాసరావు తొలగిస్తున్న క్రమంలో, అతడిని నాగేశ్వరరావు అసభ్య పదజాలంతో దూషిస్తూ తలపై కర్రతో కొట్టడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో శ్రీనివాసరావు చేతి వేళ్లకు దెబ్బలు తగిలాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

రెండు ట్రాక్టర్లు, జేసీబీ సీజ్


మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

కొత్తగూడెంరూరల్: మండలంలోని బంగారుచెలక గ్రామం నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీని లక్ష్మీదేవిపల్లి మండలం పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్ తరలించి వాటిని సీజ్ చేశారు.

క్లుప్తంగా...

19న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల సెప్టెంబర్ కోటా విడుదల

తిరుమల: టీటీడీ షెడ్యూల్ ప్రకారం తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల సెప్టెంబర్ నెల కోటాను ఈ నెల 19న విడుదల చేయనుంది. భక్తులు https:// tirupatibalaji. ap. gov. in వెబ్‌సైట్‌లో వీటిని బుక్ చేసుకోవచ్చు. అలాగే సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళపాదపద్మారాధన ఆర్జిత సేవల ఆన్‌లైన్ లక్కీడిప్ కోసం ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదుకు అవకాశం ఉంది. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన వాళ్లు సొమ్ము చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవా టికెట్లను 22వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవ వర్చువల్ సేవల కోటాను, వాటికి సంబంధించిన దర్శన టికెట్ల కోటాను 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. తిరుమల శ్రీవారి ఆలయంలో ఆగస్టు 27 నుంచి 29వ తేదీ వరకు జరుగనున్న పవిత్రోత్సవాల సేవా టికెట్ల కోటాను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

హక్కుల ఉద్యమ నేత కుక్కల ఏసు కన్నుమూత



లబ్బీపేట (విజయవాడ తూర్పు): పేదల సమస్యలపై నిరంతరం ఉద్యమించిన హక్కుల ఉద్యమ నేత, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సమితి(ఓపీడీఆర్) ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు, సీపీఐ (ఎంఎల్) నేత కుక్కల ఏసు (75) మరణించారు. విజయవాడ 24వ డివిజన్‌లో న్యూ గిరిపురంలో నివసించే ఏసు వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా గురువారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఆయన భార్య 20 ఏళ్ల కిందటే మరణించగా, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏసు ఎయిడెడ్ కళాశాలలో నాల్గవ తరగతి ఉద్యోగిగా పనిచేస్తూనే సీపీఐ (ఎంఎల్), ఓపీడీఆర్‌లో చురుగ్గా వ్యవహరించారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 14 పేటలకు సంబంధించి స్మశాన వాటిక ఆక్రమణలకు గురికాగా, దానికోసం వీరోచితంగా ఉద్యమం నడిపారు. ఈ విషయంలో అనేక పర్యాయాలు అరెస్ట్ కూడా అయ్యారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్మశాన వాటికను సాధించగలిగారు.



కృష్ణా జిల్లా గుడివాడలో జరిగిన సభకు భారీగా హాజరైన జన సందోహంలో ఓ భాగం

ఇళ్ల యజ్ఞం

ఊళ్లకు ఊళ్లే నిర్మాణం

నాలుగేళ్లుగా పేదల అభ్యున్నతే లక్ష్యంగా అడుగులు ముందుకు

గుడివాడలో టిడ్కో ఇళ్ల అప్పగింత కార్యక్రమంలో సీఎం జగన్

దేవుడి దయతో, మీ అందరి ఆశీర్వాదంతో మనం అధికారంలోకి రాగానే 300 అడుగుల టిడ్కో ఇళ్లను కేవలం ఒక్క రూపాయికే ఇస్తామని గతంలో ఇదే గుడివాడ బహిరంగ సభలో చెప్పాను. ఈ రోజు ఆ మాటను నిజం చేసి చూపిస్తున్నా. ఇవిగో ఆ ఇళ్లు.. ఇవిగో ఆ ఊళ్లు. టిడ్కో ఇళ్ల ద్వారా అక్కచెల్లెమ్మల కుటుంబాలకు మన ప్రభుత్వం రూ.16,601 కోట్లు లబ్ధి చేకూర్చుతూ ఖర్చు భరిస్తోంది. ఇందులో చంద్రబాబు చేసింది ఏమిటి? గుమాస్తాగిరీ కూడా సరిగా చేయలేదు. నిస్సిగ్గుగా తాను చేయని పనులు చేసినట్టుగా ప్రచారం చేసుకుంటున్నారు. నోరు విప్పితే అబద్ధాలే.

– సీఎం వైఎస్ జగన్



ఇంటి హక్కు పత్రాలను అందజేస్తున్న సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఏపీలో ఇళ్ల నిర్మాణ యజ్ఞం కొనసాగుతోందని, ఏకంగా ఊళ్లకు ఊళ్లే నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదల అభ్యున్నతే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నామని చెప్పారు. కృష్ణా జిల్లా గుడివాడ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం 77 ఎకరాల ఒకే లేఅవుట్‌లో పూర్తయిన 8,912 టిడ్కో ఇళ్లను ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొని, ఇంటి హక్కు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకంగా 30.60 లక్షల ఇంటి పట్టాలు అందజేశామని, ఇళ్లు కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం పేదలను అప్పులపాలు చేయాలని చూస్తే, మనందరి ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేశామని చెప్పారు. అక్కచెల్లెమ్మలు హక్కుదారులుగా ఆయా కుటుంబాల చరిత్రను మార్చేలా ఇవాళ మనం ఊళ్లకు ఊళ్లు నిర్మిస్తున్నామని చూపించే గొప్ప కార్యక్రమం గుడివాడలో జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

కొత్త గుడివాడ కనిపిస్తోంది

- ఒకవైపు టిడ్కో ఇళ్లు.. మరోవైపు మనం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు చూస్తుంటే.. ఇక్కడ కొత్త గుడివాడ నగరం కనిపిస్తోంది. మొత్తం 257 ఎకరాల్లో రూ.800 కోట్లతో 8,912 ఇళ్లు కట్టడమే కాకుండా.. వాటిని నా అక్కచెల్లెమ్మలకు ఇచ్చే కార్యక్రమం ఇవాళ చేస్తున్నాం. ఇదే లే అవుట్‌లో 7,728 ఇళ్ల స్థలాలను ఇళ్లు లేని నా నిరుపేద అక్కచెల్లెమ్మలకు ఇచ్చాం. మొత్తంగా 16,640 కుటుంబాలు ఇక్కడ నివాసం ఉండబోతున్నాయి.
- ఈ లేఅవుట్‌తో పాటు నియోజకవర్గం మొత్తం 13,145 మందికి ఇళ్ల పట్టాలిచ్చాం. వీటికి 8,912 టిడ్కో ఇళ్లు కూడా కలిపితే 22 వేల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలిచ్చామని చెబుతున్నా.
- ఒక్కో ఇంటిని రూ.2.70 లక్షలతో కడుతున్నాం. అక్కడ డ్రెయిన్లు, రోడ్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.6 లక్షలు ఖర్చవుతుంది. ఈ లెక్కన ఇంటి నిర్మాణం పూర్తయితే కనీసం రూ.10–15 లక్షలు వాళ్ల చేతుల్లో పెట్టినట్టవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా 30.60 లక్షల ఇళ్లు కూడా చూసుకుంటే మహాయజ్ఞం ద్వారా రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల కోట్ల ఆస్తిని అక్కచెల్లెమ్మల చేతిలో పెడుతున్నాం.
- ఇవాళ ఇచ్చిన పట్టాలకు సంబంధించి 4,200 ఇళ్లు మంజూరైతే మొత్తం 13,145 ఇళ్ల పట్టాలలో కూడా ఇళ్లు వస్తాయి. జూలై 8.. నాన్న గారి జయంతి రోజున ఈ ఇళ్లు కూడా మంజూరు చేస్తాం.

టిడ్కో ఇళ్ల పేరుతో నాడు పేదలపై భారం

- ఈ రాష్ట్రంలో కొంతమందికి ఈర్ష, ద్వేషం ఎక్కువయ్యాయి. ఏ మాత్రం కళ్లార్పకుండా అబద్ధాలు చెబుతున్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి గత చంద్రబాబు ప్రభుత్వం చేసిన నిర్వాకమిది. నిరుపేదలు నివాసం ఉండే 300 చదరపు అడుగుల ప్లాట్ కట్టడానికి అయ్యే ఖర్చు అడుగుకు రూ.2 వేలు చొప్పున ఒక్కో ప్లాట్‌కు దాదాపు రూ.5.75 లక్షలు, మౌలిక సదుపాయాలకు మరో రూ.లక్ష అవుతుంది. రూ.6.75 లక్షలు ఖర్చయ్యే ఒక్కో ప్లాట్‌కు కేంద్రం రూ.1.50 లక్షలు ఇస్తే రాష్ట్రం రూ.1.5 లక్షలు ఇస్తోంది. మిగిలిన రూ.3 లక్షలు చంద్రబాబు హయాంలో పేద వాడి పేరు మీద అప్పుగా రాశారు. ప్రతి నెలా రూ.3 వేలు 20 ఏళ్ల పాటు పేదవాడు కడుతూపోవాలి.
- మీ బిడ్డ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 300 చదరపు అడుగులలో నిర్మిస్తున్న 1,43,600 టిడ్కో ఇళ్లను అన్ని హక్కులతో ఒక్క రూపాయికే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నాం. రూ.6.75 లక్షలయ్యే ఒక్కో ఇంటిని అక్కచెల్లెమ్మల పేరుతో ఇస్తున్నాం.

పేదల వ్యతిరేకి చంద్రబాబు

- నాలుగేళ్లలో మన ప్రభుత్వం ఇన్ని లక్షల ఇళ్లు ఎలా కట్టగలిగింది? 30 లక్షల ఇళ్ల స్థలాలు ఎలా ఇవ్వగలిగింది? ఇదే పని 30 ఏళ్ల క్రితమే సీఎం అయిన చంద్రబాబు, మూడుసార్లు ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్న ఈ బాబు, 14 ఏళ్లు సీఎంగా ఉండి కూడా ఎందుకు చేయలేకపోయారు? కారణం చంద్రబాబు పేదల వ్యతిరేకి కాబట్టి చేయలేదు.
- 40 ఏళ్ల రాజకీయ జీవితం తర్వాత కూడా ప్రజలకు మంచి చేసిన చరిత్ర లేని చంద్రబాబుకు రెండు పక్కలా రెండు పార్టీలు ఉంటే తప్ప లేచి నిలబడలేని పరిస్థితి. ఇలాంటి ఈ చంద్రబాబు.. 175 నియోజకవర్గాల్లో 175 మంది అభ్యర్థులను కూడా పెట్టలేని ఈ చంద్రబాబు మనకు ప్రత్యర్థి అట! రాజకీయాల్లోకి వచ్చి 15 ఏళ్ల తర్వాత కూడా తాను చంద్రబాబు కోసమే పుట్టానంటున్నట్లు ప్రవర్తిస్తున్న ప్యాకేజీ స్టార్, దత్తపుత్రుడు మరో వంక. తన జీవితమే బాబు కోసమని, తన వ్యాన్‌ను చూసి మురిసిపోతూ, ఇక తాను కూడా ఎమ్మెల్యే అవుతానని, తనను ఎవరు ఆపుతారో చూస్తానంటున్నారు. వీరికితోడు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5.. మొత్తంగా గజ దొంగల ముఠా మళ్లీ రాష్ట్రాన్ని దోచుకోవాలని ప్రజల ముందుకు వస్తోంది. మీరంతా ఈ దుష్టచతుష్టయం అబద్ధాలను నమ్మకండి. మీ ఇంట్లో మీకు మంచి జరిగిందా? లేదా? అన్నది మాత్రమే కొలమానంగా తీసుకోండి. మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు సైనికులుగా మారండి.

సీఎం కావడానికి నేను సిద్ధమే

- 14 ఏళ్ల వనవాసం పూర్తయ్యింది
- సంపూర్ణ అధికారం ఇచ్చి సీఎం స్థానం ఇవ్వండి
- వారాహి యాత్రలో జనసేన అధ్యక్షుడు పవన్



పిఠాపురంలో పవన్ ప్రసంగిస్తుండగానే వెళ్లిపోతున్న అభిమానులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సీఎం కావడానికి తాను సిద్ధంగా ఉన్నానని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చెప్పారు. తన 14 సంవత్సరాల వనవాసం పూర్తయిందని, ఈ సారి అంతా జనసేన వైపు చూడండని అన్నారు. వారాహి యాత్రలో భాగంగా శుక్రవారం రాత్రి కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌లో జరిగిన వారాహి సభలో పవన్ మాట్లాడారు. తనకు సంపూర్ణ అధికారం ఇచ్చి సీఎం స్థానం ఇస్తే దేశంలో ఉన్నతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఏ పదవీ లేకున్నా ప్రజల కోసం పోరాడుతూనే ఉన్నానని చెప్పుకొచ్చారు. నాడు తనను ఎమ్మెల్యేగా గెలిపించి ఉంటే ఈ రోజు ఇలా ఉండేది కాదన్నారు. శక్తిపీఠం సాక్షిగా చెబుతున్నానని, ఆంధ్రా వీడి వెళ్లనని, సురక్ష ఆంధ్రాగా తీర్చిదిద్దుతానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ దుష్ట ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. జనసేన అధికారంలోకి వస్తే మొదటగా రాష్ట్రంలో శాంతిభద్రతలను గాడిలో పెడుతుందన్నారు. రాష్ట్రంలో 219 హిందూ ఆలయాను కూల్చివేస్తే ఈ ముఖ్యమంత్రి, ఈ ప్రభుత్వం ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోలేకపోయిందన్నారు. హిందువులు ప్రపంచంలో మైనార్టీలన్నారు. తవ్వేకొద్దీ వైఎస్సార్‌సీపీ అవినీతి బయటపడుతుందని అన్నారు. తిరుపతి శ్రీవాణి ట్రస్ట్ నిధులను అడ్డగోలుగా దోచేస్తున్నారని విమర్శించారు. మన కులపోడు అని చూడకూడదని, ఆంధ్రా బాగుపడాలంటే సరైనోడు కావాలి అనుకోండి అని అన్నారు.

ఎన్నికల్లో పోటీపై స్పష్టత ఉందా పవన్?

- సీఎం అవ్వాలనుకుంటున్నావా? లేదా?
- సగం స్థానాల్లోనైనా అభ్యర్థులను నిలబెడతావా? సింగిల్ పోటీ చేస్తావా?
- మంత్రి అంబటి రాంబాబు సూటి ప్రశ్నలు



సాక్షి, రాజమహేంద్రవరం: ఎన్నికల్లో పోటీపై జనసేన నేత పవన్ కల్యాణ్‌కు స్పష్టత ఉందా అని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. '175 స్థానాల్లో జనసేన పోటీ చేస్తుందా? సగం స్థానాల్లోనైనా బరిలోకి దిగుతారా? సింగిల్‌గా పోటీ చేస్తావా' అన్న క్లారిటీ పవన్ ఇవ్వాలని అన్నారు. మంత్రి రాంబాబు శుక్రవారం రాజమహేంద్రవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సినిమా రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చి హీరో అనిపించుకున్న వ్యక్తి ఎన్టీఆర్ అయితే.. పవన్ కామెడీ యాక్టర్ అయ్యాడని విమర్శించారు. ప్రశ్నించేందుకే పార్టీ పెట్టిన పవన్ ఐదేళ్ల టీడీపీ పాలనలో ఎవరిని ప్రశ్నించారని దుయ్యబట్టారు. మంచి పనులు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను, వైఎస్సార్‌సీపీని ప్రశ్నించేందుకే పార్టీ నడుపుతున్నారని అన్నారు. పవన్ గతంలో పొత్తులన్నారని, ఇప్పుడేమో లేదంటున్నారని, పర్యటనకో మాట మారుస్తున్నారని చెప్పారు. సీఎం అభ్యర్థి ఆయన కాదని చెప్పిన పవన్.. 2024, 2029 ఎన్నికల్లో గెలిపించాలని చెప్పడం ఆయన చంచల మనస్తత్వానికి నిదర్శనమన్నారు. కేవలం అసెంబ్లీలో అడుగు పెట్టేందుకే రాజకీయం చేస్తున్నారా? ఆయనకు సీఎం అవ్వాలని ఉందా? లేదా? చంద్రబాబును సీఎం చేసేందుకు యాత్రలు చేస్తున్నారా సూటిగా చెప్పాలని అన్నారు. ఎక్కడ నిలబడతాడో కూడా తెలియని వ్యక్తితో జన సైనికులు, వీర మహిళలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఏ విషయంలోనూ స్పష్టత లేని పవన్‌తో సావాసం కుక్కతోకను పట్టుకుని గోదావరి ఈదినట్లేనన్నారు. పవన్ రాజకీయాలకు పనికిరాడని స్పష్టంగా చెప్పారు. చిరంజీవి పార్టీ పెట్టి 18 సీట్లు గెలిచారని, రాజకీయాల్లో నిలబడలేనని నిష్క్రమించి గొప్ప నిర్ణయం తీసుకున్నారని అన్నారు. రాష్ట్రాన్ని పాలించాలనుకున్న పార్టీ అధినేత ఎక్కడైనా చెప్పులు చూపిస్తారా అని ప్రశ్నించారు. పవన్, చంద్రబాబు, బీజేపీ కలిసి పోటీ చేసినా వచ్చే ఎన్నికల్లో విజయం వైఎస్ జగన్‌దేనని చెప్పారు. పవన్, చంద్రబాబువి ఉడత ఊపులేనన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల్లో 98 శాతం అమలు చేసిన జగన్ పక్షానే పేదలు ఉన్నారని తెలిపారు.

జిల్లా వార్తలు

ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు



కల్లూరు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మధిర స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ ఉత్తీర్ణులైన వారు సర్టిఫికెట్లతో మీ సేవ కేంద్రం లేదా టీఎస్ ఆన్‌లైన్‌లో జూలై 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే, డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరాల విద్యార్థులు కూడా జూలై 31లోగా ట్యూషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు.

మద్దతు ధరపై కేంద్రం తీరు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

అశ్వారావుపేటరూరల్: పంటల మద్దతు ధరలపై కేంద్ర ప్రభుత్వం తీరు సరిగ్గా లేదని, గతంలో వ్యవసాయ చట్టాలపై చేసిన పోరాటాల కారణంగా మోదీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ ఆరోపించారు. అశ్వారావుపేటలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రైతు సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో సుదర్శన్ మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు సరైన మద్దతు ధర ప్రకటించకుండా మోసం చేశారని పేర్కొన్నారు. అలాగే, రైతులకు సబ్సిడీలు, మద్దతు ధరలో కోత పెట్టిన కేంద్రానికి తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమవుతోందని తెలిపారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం 11లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు 4లక్షల ఎకరాలకే పరిమితం చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, ధరణి వెబ్‌సైట్‌లో లోపాలను సవరించాలనే డిమాండ్‌తో త్వరలోనే పాదయాత్రలు, దీక్షలు చేపడుతామని తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డి, నాయకులు మూడ్ శోభన్, కొక్కెరపాటి పుల్లయ్య, యలమంచిలి వంశీ కృష్ణ, అన్నవరపు సత్యనారాయణ, చిరంజీవి, పిట్టల అర్జున్ పాల్గొన్నారు.

అన్నదాతలకు 'మద్దతు'తో ఊరట



పత్తి పంట (ఇన్‌సెట్) వరి పంట

- పంటలకు మద్దతు ధరలు పెంచిన కేంద్రం
- ధాన్యం క్వింటాకు రూ.143, పత్తికి రూ.640 పెరుగుదల
- అపరాల పంటలకు మరింత...

పాల్వంచరూరల్: ఈ ఏడాది రైతులు సాగు చేయనున్న పంటలకు సంబంధించి కేంద్రప్రభుత్వం తాజాగా మద్దతు ధరలు ప్రకటించింది. పెట్టుబడితో పోలిస్తే ఈ ధరలు ఆశాజనకంగా లేకున్నా.. గతేడాది చూస్తే కాస్త మెరుగ్గా పెరగడంపై రైతులు వర్షం వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం సీజన్ మొదలవుతున్న తరుణాన కేంద్రం సవరించిన మద్దతు ధరలను వెల్లడించింది. ఏటా కమిషన్ ఆఫ్ అగ్రికల్చర్ కాస్ట్ అండ్ ప్రైసెస్ సిఫారసు మేరకు కేంద్రప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయిస్తుంది. మార్కెట్‌లో ఆహార ఉత్పత్తుల ధరలు పతనమైనప్పుడు మద్దతు ధరలు రైతులను గట్టెక్కిస్తాయి. మార్కెట్లలో ఇంతకంటే ధర తక్కువగా పలికితే ప్రభుత్వ రంగం సంస్థలు రంగంలోకి దిగి మద్దతు ధరతో పంటలు కొనుగోలు చేస్తాయి.

పప్పు దినుసులకు ప్రాధాన్యం

వరి, పత్తి తదితర పంటల మద్దతు మద్దతు ధరలను కేంద్రప్రభుత్వం సవరించింది. వీటితో పోలిస్తే పప్పు దినుసుల పంటలకు మరింత ప్రాధాన్యత ఇచ్చారు. కంది క్వింటాకు రూ.7వేలు, పెసరకు రూ.8,558, వేరుశనగకు రూ.6,377, మినుములు రూ.6,950గా ధర నిర్ణయించారు. ఇక నువ్వుల పంట అధికంగా క్వింటా ధర రూ.8,635గా ఖరారు చేయడం విశేషం.

కేంద్రప్రభుత్వం పెంచిన మద్దతు ధరలు వివరాలు... (క్వింటాకు రూ.ల్లో)

పంట	గత సంవత్సరం	ఈ ఏడాది	పెంపు
నువ్వులు	7,830	8,635	805
పెసర	7,755	8,558	803
పత్తి	6,380	7,020	640
వేరుశనగ	5850	6,377	527
కంది	5,850	7,000	400
పొద్దుతిరుగుడు	6,430	6,760	360
మినుములు	6,600	6,950	350
రాగులు	3,578	3,864	268
జొన్న	2,990	3,225	235
వరి	2,060	2,203	143
మొక్కజొన్న	1,962	2,090	128

గత ఏడాది కంటే అధికమే..



కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రకటించిన మద్దతు ధరలు గతేడాదితో పోలిస్తే అధికంగానే ఉన్నాయి. పత్తి, వరి, పెసర, కంది, సజ్జ, మొక్కజొన్న, రాగులకు మంచి ధర ప్రకటించారు. పెట్టుబడి, రైతుల జీవన వ్యయం ఆధారంగా మద్దతు ధరలను ఏటా నిర్ణయిస్తారు.

– అబ్దుల్ అలీ, జిల్లా మేనేజర్, మార్కెటింగ్ శాఖ

మద్దతు ధరల పెంపుతో ఊరట



కేంద్ర ప్రభుత్వం రెండేళ్లుగా ప్రకటిస్తున్న మద్దతు ధరలను పరిశీలిస్తే ఈ ఏడాది ఆశాజనకంగా ఉన్నాయి. గత ఏడాది 'ఏ' గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,060 ఉంటే ఈసారి ధర రూ.2,203కు చేరింది. పత్తి ధర రూ.6,380 నుంచి రూ.7,020కు పెరగడం హర్షణీయం.

– నాగిరెడ్డి, ప్రభాత్‌నగర్

కాస్త గిట్టుబాటు అవుతుంది..



ధాన్యం మద్దతు ధర రూ.143 పెంచడంతో కాస్త గిట్టుబాటు అవుతుంది. మిగిలిన వాణిజ్య పంటల ధరలు బాగా పెంచారు. పంటలకు గతంలో కంటే పెట్టుబడులు పెరుగుతున్నాయి. వీటితో పోలిస్తే మద్దతు ధర సరిపోకున్నా ఈసారి పెంపు కాస్త నయమనే చెప్పాలి.

– తెల్లం మల్లేష్, రైతు, దంతలబోరు

వరుణుడు కరుణించాలని..

పాల్వంచరూరల్: వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిపించాలని కోరుతూ మండలంలోని జగన్నాథపురంలో శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతీ ఇంటి నుంచి మహిళలు జలబిందెలతో బయలుదేరి బొడ్రాయి, ముత్యాలమ్మ దేవతకు అభిషేక పూజలు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండాలని కోరుకున్నారు. గ్రామ సర్పంచ్ బి.అనితతోపాటు స్థానిక మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



జల బిందెలతో వస్తున్న మహిళలు (ఇన్‌సెట్) జలాభిషేకం చేస్తున్న మహిళలు

రుణం కోసం రణం..



ఖమ్మం అర్బన్ తహసీల్‌కు పోటెత్తిన దరఖాస్తుదారులు (ఫైల్)

- కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం బారులు దీరుతున్న ప్రజలు
- భారీగా దరఖాస్తులతో మొరాయిస్తున్న సర్వర్లు
- ఈ నెల 20తో ముగియనున్న బీసీ రుణాల గడువు



అశ్వాపురంలో మీ సేవ వద్ద దరఖాస్తుదారులు

అశ్వాపురం: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీల్లోని పలు కులాల ప్రజలకు రూ.లక్ష ఆర్థిక సాయం మంజూరు చేయనున్నట్లు ప్రకటించింది. ఎలాంటి పూచీకత్తు లేకుండా కుల, చేతి వృత్తిదారుల సంక్షేమానికి ఈ సాయం ప్రకటించగా, ఈ నెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో అర్హులైన వారు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయం, ఆన్‌లైన్ సెంటర్ల వద్ద బారులు దీరుతున్నారు. మీ సేవలో ఆన్‌లైన్ చేశాక పత్రాలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇస్తారు. అక్కడ కుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను డిప్యూటీ తహసీల్దార్లు పరిశీలించి డిజిటల్ సంతకాలు పెట్టి రెవెన్యూ సర్వర్‌లో అప్‌లోడ్ చేస్తారు. అనంతరం మళ్లీ మీ సేవ కేంద్రాల్లో ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, అంతా ఒకేసారి రావడంతో దరఖాస్తు ప్రక్రియ ఆలస్యమవుతుండగా, సర్వర్ కూడా మొరాయిస్తోంది. కొన్నిచోట్ల మీ సేవ కేంద్రాల నిర్వాహకులను తహసీల్దార్ కార్యాలయాలకే పిలిపించి దరఖాస్తులు స్వీకరిస్తుండగా.. అధికారులు అన్ని పనులు పక్కన పెట్టి సర్టిఫికెట్ల పరిశీలనలో నిమగ్నమవుతున్నారు. మరోపక్క విద్యాసంవత్సరం ప్రారంభమవుతుండడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు భారీగా దరఖాస్తులు చేసుకుంటుండగా రద్దీ మరింత పెరుగుతోంది.

పనిచేయని సర్వర్లు

మూడు రోజులుగా రెవెన్యూ సర్వర్లు, మీ సేవ సర్వర్లు మొరాయిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుదారులు పోటెత్తుతండడంతో ఈ పరిస్థితి తలెత్తుతోందని తెలుస్తోంది. మీ సేవలో సర్వర్లు సరిగా పనిచేయక వివరాలు ఆన్‌లైన్ చేయడానికి చాలా సమయం పడుతోంది. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు మూడు, నాలుగు రోజులు సమయం పడుతుండటంతో దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇక రెవెన్యూ సర్వర్ సమస్య కారణంగా తహసీల్‌లో రోజుకు 10 నుంచి 20 సర్టిఫికెట్లకు మాత్రం ఆమోదం లభిస్తోందని సమాచారం. మరోపక్క బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు నాలుగు రోజులు మాత్రమే ఉండటంతో ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. దరఖాస్తు గడువు మరిన్ని రోజులు పెంచాలని వారు కోరుతున్నారు.

బీసీ రుణాలకు గడువు పెంచాలి..



కుల, ఆదాయం ధ్రువీకరణపత్రాల కోసం బీసీలు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. పనులు మానుకుని మీసేవ కేంద్రాలు, తహసీల్ చుట్టూ తిరగాల్సి వస్తోంది. సాంకేతిక సమస్యలతో ధ్రువపత్రాలు సకాలంలో అందడం లేదు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని బీసీ రుణాల దరఖాస్తు గడువు పెంచాలి.

–వేల్పుల మల్లికార్జున్, మల్లెలమడుగు, అశ్వాపురం మండలం

సమస్యలు పరిష్కరించాలి



బీసీ రుణాలకు దరఖాస్తు చేసే వారికి కుల, ఆదాయ ధ్రువపత్రాలు సకాలంలో రాక ఇబ్బంది పడుతున్నారు. పలుచోట్ల వారం రోజులకు కూడా సర్టిఫికెట్లు అందడం లేదు. రుణ దరఖాస్తుకు నాలుగు రోజులే ఉండటంతో ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించి సర్టిఫికెట్లు త్వరగా అందేలా చూడాలి.

–తాటిపాముల ఐలయ్య, మొండికుంట, అశ్వాపురం మండలం